అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ముసురు పట్టింది. గురువారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో కాసేపు విరామమిచ్చినా సాయంత్రం నుంచి మళ్లీ కొనసాగింది. పొలాల్లోకి వర్షపునీరు పెద్దఎత్తున చేరింది. నారుమడులతో పాటు, వెదజల్లే పద్ధతిన వరినాట్లు వేసిన పొలాల్లోని పైరు నీటమునిగే దశకు చేరుకుంది. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు బంటుమిల్లిలో అత్యధికంగా 43.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా చల్లపల్లిలో 11.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 28.1 మిల్లీమీటర్లుగా నమోదైంది. రానున్న రెండురోజుల పాటు దక్షిణ కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.



శాకంబరీ శరణు..

ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం

- భారీగా తరలివచ్చిన భక్తజనం.. కిటకిటలాడిన క్యూలైన్లు
- ఆషాఢ సారెలు, శాకంబరీ ఉత్సవాలతో శోభాయమానం



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వన్‌టౌన్, జూలై 19 : శుభాలను చేకూర్చే శాకంబరీదేవిగా దుర్గమ్మ కటాక్షించింది. పచ్చని రూపంలో కొలువైన అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించి తరించేందుకు భక్తకోటి బారులు తీరింది. ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వైదిక కమిటీ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాల్లో ఈవో రామారావు పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, మంత్రాల మధ్య దుర్గమ్మను శాకంబరిగా ఆహ్వానిస్తూ కలశస్థాపన చేశారు. పచ్చటి రూపంలో చూడచక్కగా కనిపించిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే, ఆషాఢ సారె సమర్పించేందుకు వచ్చిన వారితో ఇంద్రకీలాద్రి కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణాన్ని ఆకుకూరలు, కూరగాయలతో అందంగా అలంకరించారు. శుక్రవారం సాయంత్రం జరిగిన పంచహారతుల కార్యక్రమంలో గవర్నర్ సతీమణి సమీరా నజీర్, హైకోర్టు జడ్జి సాంబశివరావు పాల్గొన్నారు. ఈవో రామారావు, ఏఈవో రమేశ్‌బాబు, అర్చక బృందం వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, చిత్రపటం అందజేశారు.



తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంలో వర్షపునీటితో నిండిన వరి పొలాలు



నిండిపోయిన వడ్లమన్నాడు డ్రెయిన్

ఆగని ముసురు

జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న వాన

- ఉప్పొంగుతున్న డ్రెయిన్లు
- ఇప్పటికే 65వేల ఎకరాల్లో వరిసాగు
- పంటల మునక భయం
- జిల్లా సగటు వర్షపాతం 28.1 మిల్లీమీటర్లు
- మరో రెండ్రోజులపాటు వర్షాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరిసాగవుతుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనా వేశారు. శుక్రవారానికి 65 వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తి చేశారు. 33,500 హెక్టార్లలో వెదజల్లే పద్ధతిలో వరి సాగైంది. మరో 31,500 హెక్టార్లలో వరినాట్లు వేశారు. 2 వేల హెక్టార్లలో నారుమడులు పోసి ఉన్నాయి. కంకిపాడు, ఉయ్యూరు, గన్నవరం, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో వెదజల్లే పద్ధతిలో నాట్లు వేసిన పొలాల్లో పైరు ఎదుగుదల కోసం ఎరువులు చల్లారు. పచ్చమూన తిరిగిన పైరు అధిక రోజులపాటు నీటిలోనే ఉండిపోతే కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు.

● నీటిలోనే వరి

మచిలీపట్నం, మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో మురుగు నీటిని సముద్రంలో కలిపే గుండేరు డ్రెయిన్ భారీ వర్షాల కారణంగా పొంగి ప్రవహిస్తోంది. ఘంటసాల తదితర గ్రామాల సమీపంలో ఈ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూడు, నాచులతో మేటవేయడంతో నీరు త్వరితగతిని దిగువకు పోవడంలేదు. గూడూరు, మచిలీపట్నం, గుడ్లవల్లేరు, పెడన, తదితర మండలాల్లో వెదజల్లే పద్ధతిలో వరినాట్లు వేసిన పొలాల్లోకి వర్షపునీరు నిలబడిపోయింది. గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. దీంతో వడ్లమన్నాడు, పరిసర గ్రామాల్లో వరి పొలాలు నీటమునిగే స్థితిలో ఉన్నాయి.

● అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, ఎండీవోలతో గన్నవరం నుంచి కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల వెంబడి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయలేకుండా చూడాలని, బలమైన గాలుల కారణంగా చెట్లు పడిపోతే రహదారులపై ప్రయాణాలకు ఇబ్బందులు లేకుండా వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం ఇలా..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. బంటుమిల్లిలో 43.6, పామర్రులో 42.0, కృత్తివెన్నులో 40.6, పెదపారుపూడిలో 36.6, మచిలీపట్నంలో 30.8, మొవ్వలో 42.2, గుడివాడలో 32.2, నాగాయలంకలో 24.8, గుడ్లవల్లేరులో 27.8, పమిడిముక్కలలో 27.6, గన్నవరంలో 33.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కంకిపాడులో 31.4, నందివాడలో 31.6, గూడూరులో 25.0, ఉంగుటూరులో 31.2, పెనమలూరులో 28.4, బాపులపాడులో 23.5, తోట్లవల్లూరులో 23.0, ఉయ్యూరులో 23.0, కోడూరులో 16.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అవనిగడ్డలో 17.4, పెడనలో 16.4, మోపిదేవిలో 14.2, ఘంటసాలలో 14.8, చల్లపల్లిలో 11.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పింకీ చిక్కాడు

గంజాయి విక్రయాల కింగ్‌పిన్ అరెస్టు | మరో 14 మంది కూడా..



పోలీసులు పట్టుకున్న గంజాయి బ్యాచ్

రోడ్డు విస్తరణలో సర్వం కోల్పోయాడు.. ఉపాధి కోసం ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో టీ స్టాల్ పెట్టుకున్నాడు.. కానీ, ఆ స్టాల్‌ను గంజాయి లావాదేవీలకు కేంద్రంగా మార్చాడు.. ఇలా తన వ్యాపారాన్ని విస్తరించుకున్నాడు ఒడిశాలోని బరంపురానికి చెందిన పింకీరౌత్. తెలంగాణలోని మేడ్చల్ సహా విజయవాడలోని యువతకు గంజాయిని సరఫరా చేస్తున్న ఈ కింగ్‌పిన్ సహా 15 మందిని విజయవాడ టాస్క్‌ఫోర్స్, యాంటీ నార్కోటిక్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు.

- నిందితుల్లో విజయవాడ, మేడ్చల్ బ్యాచ్
- 90 కేజీల గంజాయి స్వాధీనం
- బరంపురం నుంచి బెజవాడ, మేడ్చల్‌కు లింక్‌లు
- ల్యాప్‌టాప్ పార్శిల్ మాదిరిగా సరఫరా



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గంజాయి వ్యాపారానికి కింగ్‌పిన్‌గా ఉన్న పింకీరౌత్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో ఉండే గిరిజనులను చేరదీసి, వారితో గంజాయి సాగు చేయించి, ఆ పంటను కొనుగోలు చేసి, కిలో లెక్కన ప్యాక్ చేసి, తన టీ స్టాల్ వెనుక ఉన్న గదిలో భద్రపరుస్తాడు. గిరిజనుల నుంచి కిలో గంజాయిని రూ.1,000కు కొని రూ.4 వేల నుంచి రూ.5 వేలకు విక్రయిస్తాడు. ఇలా విక్రయాలు జరిపేందుకు నలుగురైదుగురిని సహాయకులుగా నియమించుకుని కమీషన్లు ఇస్తుంటాడు. ఆ గంజాయిని విజయవాడ, తెలంగాణలోని యువతకు సరఫరా చేస్తాడు. పింకీపై క్రైం నెంబరు 279/2024తో ఇప్పటికే కేసు నమోదైంది.

ల్యాప్‌టాప్ పార్శిల్

చూడటానికి ఆ పార్శిల్ ల్యాప్‌టాప్ మాదిరిగా ఉంటుంది. దాన్ని చింపి చూస్తే మాత్రం గంజాయి కనిపిస్తుంది. విజయవాడ, తెలంగాణ నుంచి వెళ్లిన వారికి ఈ పార్శిల్‌ను ఇస్తుంటాడు పింకీరౌత్. దాన్ని వారు ల్యాప్‌టాప్‌లో పెట్టుకుని తీసుకొస్తారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిలో ల్యాప్‌టాప్‌ను పోలిన పార్శిళ్లు ఉన్నాయి. విజయవాడ, తెలంగాణ నుంచి సుమారు 45-50 మంది వరకు వ్యసనపరులు పింకీతో టచ్‌లో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ముందుగా గంజాయిని తాగినవారు.. తర్వాత డబ్బు కోసం పెడ్లర్లుగా మారుతున్నట్టు పోలీసులు నిర్ధారించుకున్నారు.

15 మంది.. 90 కిలోలు

పింకీరౌత్‌తో పాటు 15 మందిని విజయవాడ టాస్క్‌ఫోర్స్, యాంటీ నార్కోటిక్ సెల్ పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాలను డీసీపీ టి.హరికృష్ణ, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఆర్.శ్రీహరి, ఇన్‌స్పెక్టర్లు నాగేంద్ర, శ్రీధర్‌కుమార్, ఎస్.రమేశ్ శుక్రవారం వెల్లడించారు. మాచవరం, సూర్యారావుపేట, భవానీపురం, కృష్ణలంక పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో ఇరుక్కుని పరారీలో ఉన్నవారిని, తాజాగా కేసులు నమోదైన వారిని పట్టుకున్నారు. ఒడిశాలోని బరంపురానికి చెందిన పింకీరౌత్, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన గోగినేని మాధవరావు అలియాస్ మాధవ, తెలంగాణలోని మేడ్చల్ జిల్లా పోతయిపల్లికి చెందిన మురుగన్ మణికంఠ అలియాస్ మ్యాక్సీ, సంకేలి గణేశ్, పెనమలూరుకు చెందిన షేక్ మొహమ్మద్ గౌస్, అబ్దుల్ హబీబ్, అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన మద్రి రఘురాం అలియాస్ రఘు, మాచవరానికి చెందిన కొమ్ము రాకేశ్, భవానీపురానికి చెందిన పాలేటి మమతరాజు, మహమ్మద్ ముజ్జమిల్ సుల్తాన్, షేక్ నజీర్, మత్తే నాని, ఇల్లూరి మధుసూదన్‌రెడ్డి, కృష్ణలంకకు చెందిన అడబాల వంశీ అలియాస్ పండు, అమన్‌సింగ్ అలియాస్ మోనోలను అరెస్టు చేశారు. వీరిలో పింకీరౌత్, మణికంఠ, గణేశ్ కేసుల్లో ఇరుక్కుని పరారీలో ఉన్నవారే. వారి నుంచి 90.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక వాట్సాప్ నెంబర్, మెయిల్

విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో గంజాయికి సంబంధించిన సమాచారం కోసం ప్రత్యేకంగా వాట్సాప్ నెంబర్, ఈ-మెయిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 9121162475 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చని డీసీపీ టి.హరికృష్ణ తెలిపారు. వాట్సాప్‌లో మెసేజ్, వాట్సాప్ కాల్ చేసి వివరాలు ఇవ్వొచ్చన్నారు. దీంతోపాటు antinarcoticcell@vza.appolice.gov.in మెయిల్ చేయవచ్చన్నారు. గంజాయి అమ్మకాలు సాగించేవారు, గంజాయిని తాగేవారు, తాగుతున్న ప్రదేశాలు.. ఇలా ఏ సమాచారాన్నైనా తమకు ఇవ్వవచ్చన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నరసాపురం ఎంపీడీవో కోసం

గాలింపు ముమ్మరం

ఎస్పీ గంగాధరరావు

కుటుంబానికి మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శ



అజ్జంపూడి వద్ద ఎంపీడీవో రమణారావు ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

మచిలీపట్నం టౌన్, జూలై 19 : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకటరమణ అదృశ్యం మిస్టరీ ఇంకా వీడలేదు. శుక్రవారం సాయంత్రం వరకు ఆయన ఆచూకీ చిక్కలేదు. ఐదు రోజుల క్రితం కనిపించకుండాపోయిన వెంకటరమణ ఆచూకీ కోసం ఇంకా గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్టు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటరమణ తన ఫోన్ ద్వారా పంపిన మెసేజ్‌ల ఆధారంగా అదృశ్యం వెనుకగల కారణాలపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామన్నారు. మూడురోజులుగా ఏలూరు కాల్వ పొడవునా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సీసీఎస్ డీఎస్పీ ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్, గన్నవరం, పెనమలూరు, కంకిపాడు, గుణదల సీఐలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి గాలిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంపీడీవోకు బ్యాంకుఖాతాల లావాదేవీలు పరిశీలిస్తున్నామన్నారు. ఈ దర్యాప్తులో పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారన్నారు. ఏదైనా సమాచారం తెలిస్తే 94407 97400 నంబరుకు తెలియజేయాలని ఎస్పీ కోరారు. 94910 63910తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించే పనిలో..

ఎంపీడీవో వెంకటరమణ కుటుంబసభ్యులతో సీఎం చంద్రబాబు గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఈ నేపథ్యంలో పోలీసులు వెంకటరమణ కోసం గాలింపు చర్యలు మరింతగా ముమ్మరం చేశారు. శనివారం కూడా ఏలూరు కాలువలో గాలింపు చర్యలు చేపట్టి, అనంతరం విజయవాడ, పెనమలూరులలో సీసీ పుటేజీలను మళ్లీ పరిశీలించనున్నట్టు పోలీసులు చెబుతున్నారు. మాధవాయిపెర్రీలో రూ.55 లక్షల బకాయిలు పెండింగ్‌లో ఉండటం, జిల్లా అధికారి ఒకరు ఈ బకాయిని వసూలు చేసే బాధ్యత ఎంపీడీవోదే అని వెంకటరమణపై ఒత్తిడి పెట్టడం తదితర కారణాలతో ఆయన ఒత్తిడికి గురయ్యారని తమ విచారణలో తేలినట్టు చెబుతున్నారు.

వెంకటరమణ కుటుంబానికి మంత్రి పరామర్శ

వెంకటరమణ కుటుంబ సభ్యులను పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. కానూరు మహదేవపురం కాలనీలోని వారి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

● నరసాపురంలో విచారణ

జిల్లా పోలీసులు విచారణ నిమిత్తం నరసాపురం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లారు. ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా ఆధ్వర్యంలో విచారణ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో రేవుకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. వివరాలను ఇన్‌చార్జ్ ఎండీవో వీరభద్రరావు, ఎంపీపీ సోని, సిబ్బంది నుంచి ఆరా తీశారు. ఆయనకు ఫోన్లు ఎక్కడ నుంచి వచ్చేవి? ఆయన ఆర్థిక పరిస్థితి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాకీ ఎప్పటి నుంచి కట్టాలి? దీనికి సంబంధించి పాటదారుడికి ఎంఈడీవో వెంకటరమణ ఇచ్చిన నోటీసులను పరిశీలించారు. విచారణలో స్థానిక సీఐ స్వామి పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీలకు

పచ్చజెండా

రెండ్రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశం

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో సొంత డివిజన్‌కు వేయకుండా చర్యలకు ఆదేశాలు
- సీసీఎల్‌ఏ నుంచి వచ్చే ప్రొసీడింగ్స్ ప్రకారం కలెక్టర్ల చర్యలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన వారు తిరిగి సొంత జిల్లాలకు వచ్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా సీసీఎల్‌ఏకు నిర్దేశించింది. దీంతో సోమవారం నాటికి ఉమ్మడి కృష్ణాజిల్లాలో తహసీల్దార్ల బదిలీల అంశం కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. సీసీఎల్‌ఏ నుంచి ప్రొసీడింగ్స్ వచ్చాక.. ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాలకు వచ్చేస్తారు. సొంత జిల్లాలకు వచ్చిన తహసీల్దార్ల సొంత రెవెన్యూ డివిజన్ల పరిధిలో నియమించకూడదని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు ఇచ్చింది. దీంతోపాటు గతంలో పనిచేసిన చోట కాకుండా.. వేరే స్థానాల్లోకి బదిలీ చేయాల్సి ఉంటుంది. సీసీఎల్‌ఏ కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చిన తర్వాత.. తహసీల్దార్లకు మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ అధికారిక ఉత్తర్వులు ఇస్తారు. తహసీల్దార్ల బదిలీలు జరగకపోవటం వల్ల పాలన కుంటుపడుతున్న వైనంపై ఆంధ్రజ్యోతి పత్రికలో పలు కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సానుకూలంగా తీసుకుని బదిలీలు కల్పించటం వల్ల తహసీల్దార్లు ప్రశాంతంగా ఉన్నారు.

చదువెలా?

- అద్దె భవనంలోనే సాగుతున్న పాలిటెక్నిక్ కళాశాల
- వైసీపీ పాలనలో నిధులు పక్కదారి
- 15 మంది విద్యార్థులకు 21 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది



మచిలీపట్నం టౌన్ : వైసీపీ పాలనలో మచిలీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిర్లక్ష్యానికి గురయింది. కనీస సౌకర్యాలు లేక అద్దె భవనాల్లో కునారిల్లుతోంది. దీంతో అడ్మిషన్లు గణనీయంగా పడిపోయాయి. కళాశాలలో 15 మంది విద్యార్థులుండగా 21 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు.

2009లో మచిలీపట్నంలోని ఆర్‌అండ్‌బి కార్యాలయ భవనంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఆ భవనం శిథిలం కావడంతో 2016లో పాలిటెక్నిక్ కళాశాలను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలకు 2018లో బందరు మండలం రుద్రవరంలో గురుకుల విద్యాలయం పక్కన 12 ఎకరాల స్థలం కేటాయించారు. భవన నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు చేశారు. ఆ స్థలాన్ని వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి తీసుకున్నారు. దీంతో గో సంఘం దగ్గర మరో ఐదెకరాల స్థలం పాలిటెక్నిక్ కళాశాలకు కేటాయించారు. అయితే ఆ స్థలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహించేందుకు ఆ శాఖాధికారులు కోరుతున్నారు. ఇలా స్థలం కోసం పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. నాబార్డు కళాశాల భవనానికి కేటాయించిన రూ.9 కోట్లు ఇతర అవసరాలకు వినియోగించారు. ఈ నేపథ్యంలో కళాశాలకు సొంత భవనం, ప్రయోగశాలలు లేక కునారిల్లుతోంది.

తిరిగి తిరిగి విసిగిపోయాం

చిలకలపూడి వరలక్ష్మీ పాలిటెక్నిక్ కళాశాల అద్దె భవనాల్లోనే విద్యాబోధన చేస్తున్నాం. కళాశాలకు కావలసిన వనరులు లేవు. లేబరేటరీలు లేనందున విద్యార్థులు కళాశాలలో చేరడం లేదు. పాలకులు, ఉన్నతాధికారులు సొంత భవనాలు నిర్మించి లేబరేటరీలు ఇస్తే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. - బండి శైలజ, ప్రిన్సిపాల్

5 మంది విద్యార్థులకు 21 మంది సిబ్బంది..

కళాశాలలో మెకానికల్, సివిల్ విద్యార్థులు 15 మంది ఉండగా, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది 21 మంది ఉన్నారు. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు లేక అధ్యాపకులు కొద్దిమంది విద్యార్థులకే విద్యాబోధనకు పరిమితమైపోయారు.



భూసార పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఢిల్లీరావు

భూసార పరీక్షలతో లాభసాటి సాగు

- మట్టి నమూనాలపై రైతులకు అవగాహన కల్పించాలి
- అత్యాధునిక భూసార పరీక్షా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఢిల్లీరావు

విజయవాడ లీగల్, జూలై 19 : రైతులు పంట వేయడానికి ముందు భూమి స్థితిగతులు తెలుసుకోవడం ముఖ్యమని, సాగును లాభసాటిగా మార్చుకోవాలంటే భూసార పరీక్షలు చేయించుకొని నిపుణుల సలహాలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. శుక్రవారం ఆయన కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ, మట్టి పరీక్షల్లో సేంద్రీయ కర్బనం మోతాదు, నత్రజని, భాస్వరం, పొటాషియం స్థితిగతులు, ఏ మట్టి ఏ రకం పంటలకు అనుకూలం వంటివన్నీ తెలుసుకొనేందుకు వీలుంటుందని, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన భూసార పరీక్షా కేంద్రాలను సద్వినియోగం చేసుకొనేలా ప్రోత్సహించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాధికార సిఫార్సులను అనుసరించి సమతుల ఎరువుల యాజమాన్యం చేపట్టవచ్చని, తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. రైతులకు అధిక దిగుబడులు ఆదాయాలు లభించేలా చేయడం రాష్ట్ర ప్రభుత్వ పాధాన్యంగా వుందని ఈ దిశగా రైతులకు వ్యవసాయ అధికారులు మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. కమిషనర్ వెంట ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇనుగంటి రాంబాబు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న దేవినేని, కొలికపూడి

జగన్‌వి శవ రాజకీయాలు : దేవినేని ఉమా

గంపలగూడెం, జూలై 19 : బెంగళూరు ప్యాలెస్‌లో 40 రోజులు డ్రామాలాడి శవ రాజకీయాలు చేసేందుకు జగన్మోహన్ రెడ్డి బయలుదేరాడని మాజీమంత్రి ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకొమెరలో ఇనుగంటి కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, శాసనసభలో చర్చల్లో పాల్గొనే ధైర్యం లేక ఢిల్లీలో డ్రామాలాడటానికి వెళ్లిన జగన్‌కు సిగ్గుందా అని ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రాష్ట్రం ముందుకు వెళ్లాలని కోరుకుంటుంటే రాష్ట్రపతి పాలనకావాలని అడుగుతున్న జగన్ మానసిక స్థితి ఎలా ఉందో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన దాడికి రాజకీయ రంగు పులిమి విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడటంలో, పరిశ్రమలు తీసుకురావడంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బ్రహ్మాండంగా ముందుకెళ్తుందన్నారు.

ఇనుగంటి కుటుంబానికి దేవినేని పరమర్శ

ఇటీవల మృతిచెందిన టీడీపీ సీనియర్ నేత ఇనుగంటి రాంబాబు కుటుంబసభ్యులను మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావులు శుక్రవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రహదారిపై ధర్నా చేస్తున్న టిడ్కో లబ్ధిదారులు

రోడ్డెక్కిన టిడ్కో లబ్ధిదారులు!

- వసతులు కల్పించాలంటూ రాస్తారోకో

గుడివాడ, జూలై 19 : కనీస వసతులు కల్పించకుండా ఇళ్లను యిచ్చారని, గత వారం రోజులుగా తాగునీరు కూడా సరఫరా చేయడం లేదని టిడ్కో లబ్ధిదారులు వాపోయారు. శుక్రవారం టిడ్కో కాలనీ నుంచి లబ్ధిదారులు ర్యాలీగా బయలుదేరి స్థానిక మార్కెట్ యార్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వారంరోజులుగా తాగునీరు కూడా సరఫరా కావడం లేదని, బ్యాంకర్లు వాయిదాలు కట్టాలంటూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పైపులైను పగిలి 10రోజులైనా మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. ట్యాంకర్లు ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదన్నారు. కాలనీలో పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉందని వాపోయారు. అనంతరం మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగి టిడ్కో లబ్ధిదారులకు నచ్చజెప్పారు. పైపులైన్‌లను బాగుచేస్తున్నామని, నీళ్ల సరఫరా చేస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వడంతో వారు రాస్తారోకో విరమించారు.



ధ్వంసమైన రేకుల ఇల్లు

త్రుటిలో తప్పిన ప్రమాదం..!

- కొండరాయి జారిపడి ఇల్లు ధ్వంసం
- మహిళకు స్వల్పగాయాలు



కాలికి గాయం

విద్యాధరపురం, జూలై 19 : ఎడతెరపి లేని వానలకు కొండరాళ్లు జారి పడుతున్నాయి. విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని కొండప్రాంతంలో శుక్రవారం ఉదయం ఓ ఇంటిపై పెద్ద కొండరాయి జారిపడటంతో ఇల్లు ధ్వంసమైంది. మహిళ కాలిపై రాయి పడటంతో స్వల్ప గాయమైంది. పిళ్లా తులసి, ఆమె భర్త గోపాలరావు, కుమార్తె కలిసి ఆ ఇంట్లో ఉంటున్నారు. గోపాలరావు వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఉదయం 6 గంటలకు పాలపాకెట్లు తీసుకురావడానికి వెళుతూ భార్య తులసిని నిద్రలేపి వెళ్లాడు. ఆమె వంటపాత్రలు శుభ్రం చేస్తున్న సమయంలో ఆకస్మికంగా రాయి జారి పడటంతో ఆమె అప్రమత్తమయ్యేలోగానే కాలికి గాయమైంది. కుమార్తె వేరే గదిలో పడుకోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయి. 38వ డివిజన్ కార్పొరేటర్ రహంతున్నీసా, కార్పొరేషన్ అధికారులు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు.

అవగాహన.. అప్రమత్తత

- సమర్థవంతంగా నగరంలో ఫ్రైడే-డ్రైడే
- ప్రజల భాగస్వామ్యంతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట
- జన జాగృతి ర్యాలీలో కలెక్టర్ సృజన



జన జాగృతి ర్యాలీలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

సత్యనారాయణపురం, జూలై 19 : సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేసి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో శుక్రవారం నగరపాలక సంస్థ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన 'డ్రైడే-ఫ్రైడే' కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులకు కారణం దోమ.. దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. అవగాహన ర్యాలిలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటి బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అవగాహన కల్పించేందుకు రెండు, మూడు నెలల పాటు జనజాగృతి ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. బుడమేరులో నీటి ప్రవాహం సరిగా ఉండేలా ప్రత్యేక యంత్రాలసాయంతో గుర్రపు డెక్క, తూటికాడలను తొలిగించడం జరుగుతుందన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండ కుండా చూసి వ్యాధులకు కారణమయ్యే దోమల బ్రీడింగ్ సోర్స్‌లను నాశనం చేయడం పైన అవగాహన కల్పిస్తున్నామన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, విభాగాలు సీజనల్ వ్యాధుల కట్టడికి తమ వంతు బాధ్యతగా చర్యలు చేపడుతున్నామని, ప్రజలు భాగస్వాములై అవగాహన పెంపొందించు కొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జానారెడ్డి, నగరపాలక సంస్థ ఇన్‌చార్జికమిషనర్ ఎ.మహేష్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్టులు) కేవీ సత్యవతి, డీఎంహెచ్ఓ ఎం.సుహాసిని, నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ పి.రత్నావళి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్, ఆర్డీవో

మౌలిక వసతుల కల్పనకు చర్యలు : కలెక్టర్ సృజన

తిరువూరు : పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి.సృజన అన్నారు. శుక్రవారం ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లో ఆమె పర్యటించారు. జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కొందరు ఇంటినుంచి భోజనం తెచ్చుకోవడాన్ని గమనించిన కలెక్టర్ వారిని ప్రశ్నించగా.. పాఠశాలలో భోజనం తినలేక ఇంటివద్దనుంచి తెచ్చుకుంటున్నట్టు తెలిపారు. ఇకపై మంచి బియ్యం అందించేలా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల పరిసరాల అపరిశుభ్రత, పలు తరగతి గదులు నిరుపయోగంగా ఉండటాన్ని గుర్తించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతరం గంపలగూడెం మండలం వినగడపవద్ద కట్టలేరుపై ధ్వంసమైన వంతెనను పరిశీలించి నూతన వంతెనకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీవో మాధవి, ఎంతఈవోలు శ్యామ్‌సుందర్, రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

- ఎంపీడీవో కుటుంబానికి మంత్రి నిమ్మల హామీ.. రక్షణ చర్యలపై ఆరా

పెనమలూరు, జూలై 19 : గత కొద్ది రోజులుగా అదృశ్యమైన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకట రమణారావు కుటుంబసభ్యులను రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు పరామర్శించారు. కానూరు మహదేవపురం కాలనీలో వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. రమణారావు అదృశ్యం బాధాకరమని, అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఎంపీడీవో కుమారులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. దర్యాప్తులో భాగంగా గాలింపు చర్యల గురించి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకొన్నారు. కేసు దర్యాప్తు, గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నట్టు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడుతూ, ఎంపీడీవో అదృశ్యం బాధాకరమన్నారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు గాలింపు చర్యలు, కేసు దర్యాప్తులో పురోగతి సాధించేలా అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీచేశారన్నారు. ఏలూరు కాల్వలో నీటి ఉధృతి, అధిక వర్షాలతో గాలింపు చర్యల్లో కొంత ఇబ్బంది కలుగుతోందని, దీన్ని అధిగమించడానికి డ్రోన్ల సహాయం తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిపారు. ఏలూరు కాల్వతో పాటు మెయిన్‌కెనాల్, సబ్‌కెనాల్‌లో గుర్రపుడెక్క అధికంగా ఉన్నచోట్ల అనుభవజ్ఞులైన లస్కర్లను వినియోగించాలని జలవనరుల శాఖకు ఆదేశాలిచ్చినట్టు మంత్రి తెలిపారు. ఎంపీడీవో కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా, మండల అధికారులు, స్థానిక నేతలు ఉన్నారు.



ఎంపీడీవో కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

ముమ్మర గాలింపు

గన్నవరం : అదృశ్యమైన ఎంపీడీవో రమణారావు ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది కేసరపల్లి నుంచి ఏలూరు కాలువలో అజ్జంపూడి, దావాజీగూడెం వైపు గాలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జయసూర్య మాట్లాడుతూ, విజయవాడ మధురానగర్ ఏలూరు కాలువ దగ్గర చివరిసారిగా ఎంపీడీవో ఫోన్ సిగ్నల్ ఆగిపోవడంతో దాని ఆధారంగా విచారణ చేపడుతున్నట్టు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, స్పెషల్ పోలీస్, లోకల్ పోలీస్ సిబ్బందితో నాలుగు రోజులుగా గాలింపు చర్యలు చేస్తున్నామన్నారు. మధురానగర్ నుంచి రామవరప్పాడు, కేసరపల్లి వరకూ ఏలూరు కాలువలో గాలించామన్నారు. ఏలూరు రేంజ్ ఐజీ పర్యవేక్షణలో అన్ని బృందాలతో కలిసి కేసరపల్లి నుంచి హనుమాన్‌జంక్షన్ పెరికీడు వరకూ ఏలూరు కాలువ దిగువనకు రెండు వైపుల గాలిస్తున్నట్టు తెలిపారు. పది బృందాలుగా పోలీసులు విచారణ చేస్తున్నారన్నారు.



నష్టపరిహారం అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

రామ్‌కో ప్రమాద ఘటనలో.. పరిహారం అందజేత

జగ్గయ్యపేట రూరల్, జూలై 19: రామ్‌కో సిమెంట్స్ ప్రమాద ఘటనలో మృతి చెందిన జయంతిపురం గ్రామానికి చెందిన నాగులు కుటుంబసభ్యులకు శుక్రవారం రూ. 12 లక్షల చెక్కును సంస్థ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్, తహసీల్దార్ శేషగిరి అందజేశారు. మృతుడి కుటుంబసభ్యులతో యాజమాన్యం చేసుకున్న ఒప్పందంలో కుమారుడు డిగ్రీ చదువుకు అయ్యే ఖర్చు, మూడేళ్ల అనంతరం కంపెనీలో ఉద్యోగం ఇస్తామని, భార్య జ్యోతికి పించన్‌తో పాటు కంపెనీ నిబంధనల ప్రకారం ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్‌ల ద్వారా కొంత నగదు వచ్చేలా ప్రయత్నిస్తామని తక్షణం మట్టి ఖర్చుల కింద రూ.30 వేలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాం చిన్నబాబు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రామ్‌కో సిమెంట్స్ ప్రమాద ఘటనలో మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చిల్లకల్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

నష్టపరిహారంపై గ్రామస్థుల ఆగ్రహం..

రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో 2000ల మందికి పైగా కూలీలు పనిచేస్తుంటారని, పనులపై వారికి సరైన శిక్షణ లేకపోవటంతో తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారని ఆరోపించారు. ఇటీవల బూదవాడ అల్ట్రాటెక్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ. 50లక్షలు చెల్లించగా రామ్‌కో కంపెనీ మాత్రం రూ. 12 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌లు, యాజమాన్యాలు కుమ్మక్కై కార్మికుల శ్రమ దోపిడీ చేస్తూ వారికి ఎటువంటి భద్రత కల్పించటం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలన్నారు.



పరిమితికి మించి ఇసుకతో పట్టుబడిన లారీ

ఇసుక స్టాక్‌యార్డులో అధికారుల తనిఖీలు

- పరిమితికి మించిన లారీలకు జరిమానా

జగ్గయ్యపేట రూరల్, జూలై 19 : అనుమంచిపల్లి ఇసుక స్టాకు యార్డు నుంచి అదనంగా ఇసుక తరలిస్తున్న లారీకి అపరాధ రుసుము విధించినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మణికంఠరెడ్డి తెలిపారు. శుక్రవారం సాధారణ తనిఖీలలో భాగంగా ఏపీ 39 ఎక్యూ 5697 నంబరు లారీని పరిశీలించగా 20 టన్నులు ఉండాల్సి ఉండగా 17.04 టన్నులు అధికంగా ఉన్నట్టు గుర్తించి టన్నుకు రూ.రెండు వేల చొప్పున రూ. 34,800లు జరిమానా విధించినట్టు తెలిపారు. అధికంగా రవాణా చేసినా, ఇతర రాష్ట్రాలకు తరలించినా, అనధికారికంగా నిల్వ చేసినా చర్యలు తప్పవన్నారు. అనుమంచిపల్లి గ్రామం తెలంగాణా సరిహద్దున ఉండటంతో స్టాకు యార్డులో అధికారులు అక్రమ సంపాదనకు తెరతీసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. పట్టుబడిన లారీకి అనుమంచిపల్లి నుంచి తొర్రకుంటపాలెంకు వే బిల్లులో సూచించారు. ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేందుకే ఇసుక ఎత్తినట్టు అధికారులు చెబుతున్నారు. యార్డులో సిబ్బందిపై ఏడీ మైన్స్‌కు సమాచారం ఇచ్చినట్టు సీఐ తెలిపారు.

పోలవరం కాలువలో యువకుడి మృతదేహం

హనుమాన్‌జంక్షన్, జూలై 19 : నూజివీడు మండలం మర్రిబంధం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ పవన్‌కుమార్ (24) మృతదేహం శుక్రవారం పోలవరం కాలువలో లభ్యమైంది. గురువారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన పవన్‌కుమార్ వేలేరు గ్రామ సమీపంలో కాలవలో పడిపోయాడు. కాలువ గట్టు పక్కన మోటార్ బైక్, చెప్పులు ఉండడాన్ని గుర్తించిన స్థానికులు యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు తొలుత భావించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కాలువపై గాలింపుచర్యలు చేపట్టారు. శుక్రవారం రంగన్నగూడెం గ్రామ సమీపంలో పవన్‌కుమార్ శవమై తేలాడు. మృతదేహానికి గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై జనార్దన్ తెలిపారు.

ఫోర్‌వీలర్ టెక్నీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, జూలై 19 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువత, విద్యార్థులకు వివిధ రకాల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో భాగంగా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో స్కిల్ హబ్‌లో ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సు నాల్గవ బ్యాచ్, డిజిటల్ మార్కెటింగ్ మూడవ బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నట్టు తెలియజేశారు. ఈ కోర్సుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఆఖరి తేదీ జూలై 26 అన్నారు. మూడు నెలల పాటు నైపుణ్య శిక్షణ కల్పించి వారికి స్థానికంగా, ఇతర రాష్ట్రాలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి వున్న యువత వారి విద్యార్హతను బట్టి రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా కోరారు.

అర్హతలు : ఫోర్ వీలర్ టెక్నీషియన్‌కు 8-10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమో, ఏదైనా డిగ్రీ, డిజిటల్ మార్కెటింగ్‌కు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ కలిగి ఉండాలి. అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://ఎఫ్ఓఆర్ఎంఎస్.జీఎల్ఇ/ఆర్ఎఫ్‌యుఓ.ఇన్9వై బీటీకేఎల్‌టీఎఫ్‌టిసిఎ లింక్‌పై క్లిక్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 9985759304, 8008742842, 9347779032 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

డ్రైన్‌లలో పేరుకున్న డెక్క!

- నీటి ప్రవాహానికి అడ్డుకట్ట
- ముందస్తు చర్యలు శూన్యం
- గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు, రైతు నాయకులు వినతి



ఘంటసాల - బిరుదుగడ్డ రోడ్డులోని గుండేరు వంతెన వద్ద గుర్రపు డెక్క

ఘంటసాల : మండలంలో ప్రవహిస్తున్న గుండేరు, చిల్లలవాగు, భీమనది ఛానల్, గంజి కాలువలో తూటుకాడ విస్తారంగా పేరుకుపోయింది. వర్షాలు కురుస్తుండటంతో గుర్రపు డెక్క, తూటుకాడ డ్రైన్ అంతా దట్టంగా వ్యాపించి అడ్డంకిగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైన్‌లలో నీటిపారుదలను గుర్రపు డెక్క అడ్డుకుంటోంది. గుండేరు డ్రైన్ పరిధిలోని ఘంటసాలెం, చాట్రగడ్డవానిగూడెం సమీపంలో ఉన్న పాత వంతెన వద్ద, ఘంటసాల - చల్లపల్లి ప్రధాన రహదారి అయిన దేవరకోట వంతెన వద్ద, బిరుదుగడ్డ వంతెన వద్ద, గుర్రపు డెక్క నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. వర్షం ఇలాగే కురిస్తే పంట పొలాలు మునిగిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గుండేరు, చిల్లలవాగు, భీమనది ఛానల్, గంజి కాలువ డ్రైన్ల పరిధిలో కొంతమంది రైతులు నాట్లు పూర్తి చేసుకోగా, కొందరు వెద పద్ధతిపై వ్యవసాయం సాగు చేస్తున్నారు. నారు మడులు కూడా మునిగిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.



చాట్రగడ్డగూడెం - జోడుగూడెం పాత వంతెన వద్ద..

ముందస్తు చర్యలేవీ..

వేసవికాలంలో డ్రైన్‌ల మరమ్మతులు చేయాల్సిన అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవటంతో తూటుకాడ, గుర్రపు డెక్క కలుపుజాతి మొక్కలతో పేరుకుపోయాయి. వవేసవికాలంలో ఉపాధి పనులతో గానీ, స్ప్రేయింగ్ పద్ధతుల్లో గానీ డ్రైన్‌లో చెత్తాచెదారాలను తొలగించే చర్యలు చేయక అధికారులు మిన్నకుండిపోవటంతో డ్రైన్‌లలో నేడు ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తొలగింపు చర్యలు చేపట్టాలి

గుండేరు డ్రైన్‌లో దట్టంగా అల్లుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షులు వేమూరి రత్నగిరిరావు, శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షుడు దోనేపూడి గోపికృష్ణ, రైతు నాయకులు మిక్కిలినేని మధు డిమాండ్ చేస్తున్నారు. ఘంటసాల మండల పరిధిలోని ఉన్న గుండేరు డ్రైన్ పరివాహ ప్రాంతాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటి వరకు అయితే రైతులకు ఎలాంటి నష్టం లేనప్పటికీ డ్రైన్‌లలో ఉన్న గుర్రపు డెక్క తొలగించకపోతే భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరారు.

బిల్లులు చెల్లించండి సారూ..!

- జేసీ ఆదేశాలూ బేఖాతరు..
- ఎన్నికల పనుల్లో కాంట్రాక్టర్‌కు చుక్కలు
- రూ.3.50 లక్షలు ఇవ్వకుండా తిప్పలు
- జగ్గయ్యపేట తహసీల్దార్ తీరుపై కలకలం



తహసీల్దార్‌ను బిల్లుల కోసం ప్రశ్నిస్తున్న కాంట్రాక్టర్ ఆంజనేయులు

జగ్గయ్యపేట, జూలై 19 : జాయింట్ కలెక్టర్ ఆదేశించినా మాకేంటి.. అంటూ ఎన్నికల బిల్లులు ఇచ్చేందుకు జగ్గయ్యపేట తహసీల్దార్ ససేమిరా.. అనటంతో శుక్రవారం జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో కాంట్రాక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌ల వైఖరితో విసుగు చెందిన గుంటూరు కాంట్రాక్టర్ బిల్లులు ఇవ్వకపోతే ఇక్కడే ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటా అంటూ అవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి, కొత్త ప్రభుత్వం కొలువు దీరినా.. ఎన్నికల వ్యయానికి సంబంధించి బిల్లులు చెల్లించేందుకు జగ్గయ్యపేట రెవెన్యూ అధికారులకు తీరిక రావడంలేదు. కాంట్రాక్టర్లకు చుక్కలు చూపిస్తున్నారు. డీటీలు, ఏపీవోలు, ఓపీవోలుగా పనిచేసిన వారికీ సరైన మొత్తంలో పారితోషికాలు ఇవ్వలేదు. ఎన్నికల కమిషన్ ఇవ్వమన్న పారితోషికానికి, అధికారులు ఇస్తున్నదానికి పొంతనలేదని ఆరోపణలు వస్తున్నాయి. గుంటూరుకు చెందిన కాంట్రాక్టర్ ఆంజనేయులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఇబ్రహీంపట్నం నిమ్రా కాలేజి కౌంటింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ పనులు, జనరేటర్లు, ఆయిల్, ఎలక్ట్రీషియన్లను ఏర్పాటు చేశాడు. ఇందుకు గాను జగ్గయ్యపేట అసెంబ్లీ కౌంటింగ్ ఖర్చు కింద రూ.3.50లక్షలు చెల్లించాల్సి ఉంది. కౌంటింగ్ ప్రక్రియ ముగిసి రెండు నెలలు దాటుతున్నా ఇంత వరకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఎన్నికల అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేదని కాంట్రాక్టర్ ఆరోపిస్తున్నాడు.

జేసీ సంపత్‌కుమార్ మైలవరం ఆర్వోగా ఉండటం, తూర్పు నియోజకవర్గం నుంచి బిల్లులు ఇప్పించినా జగ్గయ్యపేట తహసీల్దార్ మాత్రం వాయిదాలు వేస్తున్నారన్నారు. శుక్రవారం కార్యాలయానికి వచ్చిన కాంట్రాక్టర్ ఆంజనేయులు తహసీల్దార్ శేషు, డీటీ నాగరాజును దీనిపై నిలదీశారు. జేసీ చెప్పినా బిల్లులు ఎందుకు ఇవ్వటం లేదంటూ మండిపడ్డారు. బిల్లులు ఇవ్వకపోతే ఇక్కడే కాగితం రాసి నుయ్యో, గొయ్యో చూసుకుంటానని హెచ్చరించారు. ఆంజనేయులు మాటలు కార్యాలయంలో కలకలం రేపాయి.

బాలికకు వేధింపులు.. పోక్సో కేసు నమోదు

గుడ్లవల్లేరు, జూలై 19 : బాలికను దురుద్దేశపూర్వకంగా వేధిస్తున్నాడన్న అభియోగంపై వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. గుడ్లవల్లేరు ఎస్ఐ జి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన మదిరి అరుణ్ కుమార్ (55) తన ఇంటి సమీపంలో ఉండే బాలికపై జూలై 1న అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక తల్లి, బంధువులు గట్టిగా మందలించారు. అప్పటి నుంచి బాలికను, కుటుంబసభ్యులను వేధింపులకు గురిచేస్తున్నాడు. శుక్రవారం బాలిక రోడ్డుపై వెళుతుండగా బైక్‌తో వెంబడించి వేధిస్తుండటంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 115, 123, 133
చికెన్ విత్ స్కిన్ 218
చికెన్ స్కిన్‌లెస్ 228

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

మొక్కు తీర్చుకున్న టీడీపీ మహిళా నాయకురాలు ఆషా



ఉయ్యూరు, జూలై 19 : నెల్లూరు బారాషాహెద్ దర్గా వద్ద జరిగే రొట్టెల పండుగ మహోత్సవంలో ఉయ్యూరుకు చెందిన టీడీపీ నాయకురాలు ఆషా పాల్గొని శుక్రవారం రొట్టెలు పంచి మొక్కుబడి తీర్చుకున్నారు. రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, పెనమలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్ విజయం సాధించాలని ఆమె మొక్కుకున్నారు. తను అనుకున్నది జరగటంతో దర్గా మహోత్సవంలో పాల్గొని రొట్టెలు పంచి మొక్కు తీర్చుకున్నట్టు ఆమె తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

తాడిగడప మునిసిపల్ కమిషనర్



పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు, జూలై 19 : తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని అన్ని క్లస్టర్లలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి డ్రైన్లు, కాల్వలలో పూడిక తీతకు స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కానూరులోని ఉమాశంకర్‌నగర్, పీఅండ్‌టీ కాలనీ, పోరంకి సుగాలి కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచనల మేరకు ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్ ఉన్నారు.

పారిశుధ్యం పట్ల శ్రద్ధ వహించాలి

హనుమాన్‌జంక్షన్ : భారీ వర్షాలు కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ వహించాలని బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లుతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అకాల వర్షాలు కారణంగా గ్రామాల్లో పారిశుధ్య నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలకు ఇచ్చే పాలు, గుడ్లు నాణ్యతగా ఉండే విధంగా చూడాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్లకు సూచించారు.

ఆస్తి తగాదాతో ఇంటికి నిప్పు

ఆకునూరు(ఉయ్యూరు), జూలై 19 : చిన్న నాన్న పెదనాన్న పిల్లల మధ్య ఆస్తి తగాదా ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన శుక్రవారం ఆకునూరు అంబేడ్కర్ నగర్‌లో జరిగింది. ఉయ్యూరు రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. ఆకునూరుకు చెందిన బొంతు ప్రమీల, పెనమలూరుకు చెందిన బొంతు సునీల్‌కు ఆస్తి తగాద నడుస్తుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్న సమయంలో సునీల్ ఆకునూరు వచ్చి ప్రమీల ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పి, ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా వ్యాస మహర్షి జయంతి

గన్నవరం, జూలై 19 : సూరంపల్లిలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాస మహర్షి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏడాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల్లో 25 మండలాల్లో 468 గ్రామా ల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని మహిళా కన్వీనర్ రాజేశ్వరీ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని కోదండ సీతారామాలయంలో అమ్మవారికి ఆషాఢ మాస సారె సమర్పించారు. సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ యండవల్లి పాండురంగారావు, మల్లంపాటి వెంకటేశ్వరరావు, బెజవాడ మధు, నాగరాజు పాల్గొన్నారు.

విరిగిన ఆర్టీసీ బస్ స్టీరింగ్

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఉయ్యూరు, జూలై 19 : ఆర్టీసీ మెట్రో బస్సు స్టీరింగ్ విరిగిపోగా డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పింది. ఉయ్యూరు డిపోకు చెందిన మెట్రో బస్సు శుక్రవారం విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ నుంచి ఉయ్యూరు వస్తుండగా గండిగుంట సర్వీసు రోడ్డు, అండర్ పాస్ తరువాత మలుపువద్ద స్టీరింగ్ విరిగిపోయింది. ఆసమయంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పిపోగా ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాలు, వరదలపై వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డీకే బాలాజీ

గన్నవరం, జూలై 19 : భారీవర్షాలు, వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం అధికారులను ఆదేశించారు. గన్నవరం ఎంపీడీవో కార్యాలయం నుంచి రెవెన్యూ డివిజన్‌ల అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు చర్యలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో పరిస్థితులు గమనిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పాకలు, పూరిళ్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారన్నారు. గర్భిణులు, డయాలసిస్ పేషంట్‌లను దగ్గరలోని పీహెచ్‌సీలకు తరలించాలన్నారు. అవసరమైనన్ని రేషన్ సరుకులు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.



ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని, రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని, ఈ మేరకు రైతాంగాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామస్థాయి ఉద్యాన, వ్యవసాయ సహాయ సిబ్బందికి ఆయిల్‌పామ్ సాగుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె.జ్యోతి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగులో కృష్ణాజిల్లా ముందుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు లభిస్తాయని జూలై 15 నుంచి సెప్టెంబరు 15 వరకూ మెగా ఆయిల్ పామ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా సూక్ష్మ సేద్య పథక సంచాలకులు విజయలక్ష్మి, పతంజలి ఫుడ్స్ డీజీఎం జి.వీరేందర చౌదరి మాట్లాడుతూ, సూక్ష్మ సేద్యంతో ఆయిల్ పామ్ మరింత లాభదాయకంగా ఉంటుందన్నారు. పెద అవుటపల్లి రైతు ఆళ్ల వెంకటేశ్వరరావు సాగులో తన అనుభవాలు వివరించారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, ఉయ్యూరు. కంకిపాడు, పెనమలూరు మండలాల ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



గంగూరులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గంగూరు (కంకిపాడు), జూలై 19 : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, టీడీపీ హయాంలో మొక్కలు నాటుతుంటే, వైసీపీ హయాంలో గంజాయి మొక్కలు నాటారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విమర్శించారు. గంగూరులో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని గంజాయి ఉత్పత్తి రాష్ట్రంగా మార్చేసారన్నారు. యువత గంజాయికి బానిసలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో వర్షాలు సకాలంలో కురవాలన్నా భావితరాలను కలుషితం లేని గాలి అందించాలన్నా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఓ యజ్ఞంలా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్ ప్రసాద్, సెంగెపు రంగారావు, అక్బర్ బాషా, అబ్దుల్ ఇర్ఫాన్, ఫర్హా, పరీన్, జయరాజు, కోటయ్య, పల్లె సందీప్, చుండూరు శివ, అబ్దుల్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టవా!

- కోరం లేక బాపులపాడు మండల సమావేశం వాయిదా
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వైసీపీ సభ్యులు
- 24 మందికి ముగ్గురు మాత్రమే హాజరు



సభ్యులు రాక ఖాళీగా కుర్చీలు

హనుమాన్ జంక్షన్, జూలై 19 : ప్రజా సమస్యలు పట్ల బాపులపాడు మండల పరిషత్ ప్రజాప్రతినిధులకు ఎంత బాధ్యత ఉందో శుక్రవారం నిర్వహించిన మండల సమావేశం మరోసారి రుజువు చేసింది. ఎంపీడీవో కె.రత్న కుమారి ఎంపీపీ సమావేశం ఏర్పాటు చేశారు. మెజారిటీ అధికార వైసీపీకి చెందిన 21 మంది ఎంపీటీసీ సభ్యుల్లో కేవలం ముగ్గురు మాత్రమే సమా వేశానికి హాజరు కావడంతో కోరం లేక సమావేశం వాయిదా వేసి రద్దు చేశారు. గత వైసీపీ పాలనలో మండల పరిషత్ అధికారం కూడా వైసీపీకే దక్కింది. 24 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 21 స్థానాలు వైసీపీవి. కేవ లం మూడు స్థానాలు మాత్రమే టీడీపీకి ఉన్నాయి. శుక్రవారం ఉదయం సమావేశం ఏర్పాటు చేస్తే 12 గంటలైన సభ్యులు హాజరు కాలేదు. వైసీపీకి చెందిన కోడూరుపాడు ఎంపీటీసీ (వైస్‌ఎంపీపీ) చందు రమాదేవి, కాకుల పాడు సభ్యుడు పడకల కోటేశ్వరరావు, టీడీపీకి చెందిన వీరవల్లి-2 సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణతో పాటు వైసీపీ జడ్పీటీసీ సభ్యురాలు కె.గంగా భవాని కూడా హాజరయ్యారు. దంటగుంట్ల, బొమ్ములూరు. శేరీన రసన్నపాలెం సర్పంచ్‌లతో పాటు కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి నిధులు

కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపిన బొమ్ములూరు గ్రామస్థులు



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ అందజేస్తున్న తెలుగు యువత నాయకుడు నితీష్‌కుమార్ (ఫైల్)

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 19 : ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా బొమ్ములూరు గ్రామంలోని వాటర్ ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బొమ్ములూరులో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ సమస్య గురించి ఎమ్మెల్యే సమక్షంలో కలెక్టర్ దృష్టికి తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్ తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు జలజీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు మంజూరు చేసినట్లు త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతామని సమాచార మిచ్చారని అర్జీ దారుడు నితీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అధికారులు ఇచ్చిన సమాచారంలో గ్రామంలో నీటి సరఫరా నిమిత్తం జలజీవన్ మిషన్ ద్వారా రూ. 49.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు, వీటితో 40వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటుకు అంచనాలు రూపొందించి, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

స్కానింగ్ కేంద్రాల నమోదు తప్పనిసరి

డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి



కానూరులో స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గీతాబాయి

పెనమలూరు, జూలై 19 : చట్టరీత్యా స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా నమోదు చేయాలని కృష్ణాజిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి అన్నారు. లింగనిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పటిష్ఠంగా తాము అమలు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కానూరులోని హరీష్ కార్డియాక్ ఆసుపత్రి, టాప్ స్టార్ ఆసుపత్రిలోని స్కానింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఆరోగ్య విద్యాబోధకుడు రాజేంద్రకుమార్ ఉన్నారు.

ఎన్‌టీటీఎఫ్ రోడ్డుకు మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



గన్నవరం, జూలై 19 : మండలంలోని దావాజీగూడెం ఎన్‌టీటీఎఫ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఆ రోడ్డులో ఎన్‌టీటీఎఫ్ కళాశాలతో పాటు మూడు బాలికల వసతి గృహాలు ఉన్నాయి. రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 14న నరకదారులు అనే శీర్షికన వార్త ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో ఎంపీడీవో ఇ.సత్యకుమార్ స్పందించి పంచాయతీ కార్యదర్శి సత్యబాబుకు వెంటనే సమస్యను పరి ష్కరించాలని ఆదేశించారు. శుక్రవారం సర్పంచ్ బడుగు బాలమ్మ ఎన్‌టీటీఎఫ్ రోడ్డుకు జేసీబీతో మరమ్మతులు చేయించారు.

గురుపౌర్ణమికి విశేష అభిషేకాలు

గుడ్లవల్లేరు : గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం గంగాపార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి దేవస్థానంలోని సాయిబాబా ఆలయంలో మహా రుద్ర సంఖ్యాక షష్ఠ్యుత్తర శత అభిషేకం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ కొసరాజు వెంకటాద్రి (పెదబాబు) తెలిపారు. నాగరాజు క్యాటరింగ్స్ అధినేత కె.నాగరాజు, లక్ష్మీకుమారి దంపతులు దీనిని నిర్వహిస్తారన్నారు.

ఘనంగా శాకంబరి ఉత్సవం

ఉంగుటూరు, జూలై 19 : శాకంబరీ దేవి ఆరాధనతో తరిగిపోని ధాన్యసంపదతోపాటు, అన్నపానాదులకు లోటులేని, ఆకలిదప్పులకు తావులేని సుఖమయ జీవితాన్ని పొందుతారని ఆత్కూరు శ్రీకనకదుర్గమ్మ దేవస్థానం ప్రధాన అర్చకులు పి.మౌళీకుమార్ శర్మ అన్నారు. శుక్రవారం ఆషాఢమాసం మూలా నక్షత్రం సందర్భంగా మండలంలోని ఆత్కూరు గ్రామపరిధిలో చెన్నై-కోల్‌కతా జాతీయరహదారి పక్కన కొలువైవున్న శ్రీకనకదుర్గ దేవస్థానంలో శాకాంబరీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు 500 కేజీల వివిధ రకాల కూరగాయలు, దుంపలు, ఆకుకూరలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలు రాజారెడ్డి, చిన్నా, కృష్ణప్రసాద్, సింహాచలం తదితరులు కుటుంబసమేతంగా అమ్మవారి పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉయ్యూరు : ఆషాడమాస త్రయోదశి పురస్కరించుకుని శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జగదాంబ అమ్మవారిని శాకంబరి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు. శాకంబరి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించి పూజలు చేసేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో సురేశ్‌బాబు, మురళి భక్తులకు ఏర్పాట్లు చేశారు.

పెనమలూరు : కానూరు గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారిని శుక్రవారం భక్తులు కూరగాయలతో అలంకరించడంతో శాకాంబరీదేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● తాడిగడప శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గన్నవరం : పురుషోత్తపట్నంలోని భువనేశ్వరీ అమ్మవారి దేవాలయంలో ఆషాఢ మాసం విశేష పూజలు శుక్రవారం చేశారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మ వారికి సారె సమర్పించారు. పలురకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ అర్చకులు మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పంటలు పండి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ గంగానమ్మతల్లికి సింగన్న గూడెం మహిళలు ఆషాఢసారె సమర్పించారు. సింగన్నగూడెంకు చెందిన మహిళలు, భక్తులు, సరమసత సేవా ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో గంగానమ్మ తల్లికి శుక్రవారం ఆషాఢసారె సమర్పించారు. గన్నవరం సబ్‌డివిజన్ ధర్మప్రచారక్ పాండురంగారావు, ఉపసర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.




కూరగాయలతో అలంకరించిన కానూరు గోపయ్య, లక్ష్మీతిరుపతమ్మ.. ప్రత్యేక అలంకరణలో తాడిగడప శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి





శాకంబరిదేవిగా ఉయ్యూరు జగదాంబ.. యాకమూరులో శాకంబరిదేవిగా దర్శనమిచ్చిన బోలెం వారి అకమ్మతల్లి .. ఆత్కూరులో శాకంబరిదేవిగా కనకదుర్గమ్మ



పురుషోత్తపట్నంలో అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న భక్తులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115, 123, 133
చికెన్ విత్ స్కిన్	218
చికెన్ స్కిన్‌లెస్	228



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.30

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ



మచిలీపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను ఎస్పీ ఆర్.గంగాధర రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తికి పూలమొక్కను అందించారు. లోక్‌అదాలత్ ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారం కోసం న్యాయశాఖతో పోలీస్ శాఖ సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటానని ఎస్పీ తెలిపారు. విజయవాడ సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబును విజయవాడలో ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు.



మక్కా యాత్ర విజయవంతం కావాలి

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు నుంచి ఎనిమిది మంది ముస్లింలు శుక్రవారం మక్కా యాత్రకు బయలుదేరారు. టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రచార కార్యదర్శి ఎం ఎం దౌలా పూలమాలలు వేసి యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

చందన రంగారావుకు విక్కుర్తి పరామర్శ

మోపిదేవి : వైసీపీ శ్రేణుల దాడిలో తీవ్రంగా గాయపడి మచిలీపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు చందన రంగారావును ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. మచిలీపట్నంలో చికిత్స పొందుతున్న రంగారావును పరామర్శించి దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

కాల్వ పూడికతీత పనుల పరిశీలన

కోడూరు : రైతుల అభివృద్ధి కోసమే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నారని కోడూరు మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు అన్నారు. కోడూరు 11 నెంబర్ పంట కాలువ పూడికతీత పనులను ఇరిగేషన్ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. బుద్ధప్రసాద్ కృషితో నియోజకవర్గంలో రూ.5.30 కోట్ల నిధులతో పంట కాలువలు మరమ్మత్తులు చేస్తున్నట్లు తెలిపారు. మేడా శివాజీ, అప్పికట్ల రవీంద్ర పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3.38 లక్షలు

గుడివాడ : గౌరీశంకరరస్వామి దేవస్థానం హుండీలను శుక్రవారం లెక్కించగా 120 రోజులకు రూ.3,38,652 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఈవో వి.డి.డి ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్య

బంటుమిల్లి : ప్రేమించి మించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన బంటుమిల్లిలో జరిగింది. బంటుమిల్లిలో బట్టల షాపులో పని చేస్తున్న గరికిముక్కు సుస్మిత (19)కు రామవరపుమోడి గ్రామానికి చెందిన వల్లభు హనుమంతుతో సంవత్సరం క్రితం ప్రేమలో పడింది. హనుమంతు పెళ్లికి నిరాకరించడంతో ఈనెల 14వ తేదీన ఎలుకలు మందు తిని ఆత్మహత్యాయత్నానకు పాల్పడింది. బంధువులు వైద్యం కోసం మచిలీపట్నం తరలించి, చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుస్మిత గురువారం రాత్రి మరణించింది. తండ్రి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు డిఎస్పీ అబ్దుల్ సుభాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకాల వితరణ

పామర్రు : దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలని ఎస్సై పి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జమీదగ్గుమిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాపర్లకు చెందిన మేడిశెట్టి వీరవసంతరావు, వీరరాఘవమ్మ ట్రస్టు వ్యవస్థాపకులు జగన్మోహనరావు, నాగేంద్ర వితరణతో అందించిన నోట్‌పుస్తకాలు, విద్యాసామగ్రి ఎంఈవో గుమ్మడి పద్మవాణితో కలసి అందజేశారు. ఉపాధ్యాయులు విజయరాణి, రామ్మోహనరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

తూటుకాడ తొలగింపు

పెడన : ముక్కొల్లు గ్రామంలో వడ్లమన్నాడు డ్రెయిన్ తూటుకాడ తొలగింపు పనులను గూడూరు మండల టీడీపీ నాయకులు పరిశీలించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చొరవతో డ్రెయిన్‌లో తూటుకాడ తొలగింపు పనులు జరుగుతున్నాయి. కృష్ణప్రసాద్ సూచన మేరకు పోతన స్వామి, గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, సమ్మెట రాఘవప్రసాద్, సిరివెళ్ళ శ్రీనివాసరావు తదితరులు తూటుకాడ తొలగింపు పనులను పరిశీలించారు.

సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు రేపు

గుడ్లవల్లేరు : గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల 21వ తేదీ ఆదివారం గంగాపార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి దేవస్థానంలోని సాయిబాబా ఆలయంలో మహారుద్ర సంఖ్యాక షష్ఠ్యుత్తర శత అభిషేకం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ కొసరాజు వెంకటాద్రి (పెదబాబు) తెలిపారు. నాగరాజు క్యాటరింగ్స్ అధినేత కె.నాగరాజు, లక్ష్మీకుమారి దంపతులు దీనిని నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి దత్తహోమం, అనఘాలక్ష్మీ హోమం, రుద్ర హోమం, మహా పూర్ణాహుతి నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 6 గంటలకు సాయిబాబాకు పుష్పయాగోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని తరించాలని నాగరాజు కోరారు.

ట్రైసైకిల్ వితరణ

పెడన : పట్టణంలోని 11వ వార్డుకు చెందినదివ్యాంగుడు గూడూరు ఏసోబుకు సహాయ ఫౌండేషన్ శుక్రవారం ట్రై సైకిల్‌ను అందజేసింది. ఫౌండేషన్ ప్రతినిధులు ఎండి ఉస్మాన్‌బాషా, మట్టా రాధాకృష్ణమూర్తి, తాతా సాయిరామ్, రౌతుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

అవనిగడ్డ : చిన్నతనం నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేస్తే విజయం సాధ్యమవుతుందని ప్రముఖ మోటివేటర్ శ్రీనివాసరావు అన్నారు. అవనిగడ్డ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం కెరీర్ గైడెన్స్‌పై శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. లక్ష్య సాధనకు ఎలా కృషి చేయాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.రేఖారాణి, వైఎస్ ప్రిన్సిపాల్ నరసింహారావు పాల్గొన్నారు.

సామూహిక సాయి వ్రతాలు

మచిలీపట్నం టౌన్ : సత్యసాయిబాబా 99వ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం మచిలీపట్నం సత్యసాయి మందిరంలో 99 కలశాలతో సత్యసాయి సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక సమన్వయకర్తలు వై. సాయిబాబు, మణిశ్రీ, అనుమకొండ వెంకటేశ్వరరావు పాదుకలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. జిల్లా వేద అధ్యయన సమన్వయకర్త పాతూరి జ్ఞానేశ్వరశర్మ ఆధ్వర్యంలో పోతుకూచి ఆంజనేయకుమార్ సత్యసాయి కథలను వినిపించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయిబాబా సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, ఆధ్యాత్మిక సమన్వయకర్త లక్ష్మీప్రసన్న, ఎస్. బాలా త్రిపురసుందరీ, నాగమణి, కళ్యాణి, మురళీకృష్ణ, గోవర్ధనగిరిరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



కాగితకు వినతిపత్రం అందజేస్తున్న బాలిక తల్లిదండ్రులు



కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న కుమార్‌రాజా

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

• వైసీపీ పాలనలో జరిగిన అవినీతికి అధికారులు బాధ్యత వహించాల్సిందే : మండలి

మోపిదేవి, జూలై 10 : అధికారులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయా శాఖల వారీగా సమీక్ష జరిపారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో జగనన్న గృహ నిర్మాణాలు, రెవెన్యూ వంటి అనేక శాఖల్లో జరిగిన అవినీతి చూస్తుంటే పరిపాలనపై అసహ్యం వేస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు అండగా ఉన్నారనుకుని అవినీతికి పాల్పడితే శాఖాపరంగా బాధ్యత వహించాల్సింది అధికారులే అని గుర్తుంచుకోవాలన్నారు. రెవెన్యూ, హౌసింగ్ వంటి శాఖల్లో తవ్వేకొద్దీ అవినీతి బయటపడుతోందన్నారు. జగనన్న లేఅవుట్ల మెరక పేరుతో వేల టన్నుల మట్టి తవ్వకాలు జరుగగా, ఒక్క ఉద్యోగి అవినీతిని నిరోధించలేదన్నారు. ఎస్సీ సామాజిక వర్గాల వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెంటున్నర స్థలం ఇవ్వకుండా ప్రత్యేక మినహాయింపులు ఏమైనా ఉన్నాయా? అని మోపిదేవి ఎంపిటిసి సభ్యుడు కొమ్ము పవన్ కుమార్ హౌసింగ్ డీఈ భానుజీరావును ప్రశ్నించారు. మోపిదేవి పంచాయతీ లే అవుట్ -3లో ఎస్సీలకు సెంటున్నర చొప్పున పట్టాలు ఇచ్చి, సెంటు స్థలంలోనే గృహం నిర్మించటం ఏమిటని నిలదీశారు. కొక్కిలిగడ్డ లే అవుట్‌లోనూ డ్రైనేజీలు, కాల్వలు ఆక్రమించి గృహాలు నిర్మించినా అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు అన్నారు. మండల స్థాయి అధికారులు సమావేశాలకు రానప్పుడు సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు. బొబ్బర్లంక, పెదకళ్లేపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు శిథిలావస్థకు చేరాయని, ఏ విధమైన ప్రమాదాలు జరుగకుండా వాటిని ఆధునీకరణ చేయాలని సర్పంచ్‌లు అరజా సంధ్యారాణి, దొప్పలపూడి గంగాభవాని కోరారు. సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తామని ఇన్‌చార్జి ఎంపిడివో రామలింగేశ్వరరావు తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ నడకుదుటి జనకీకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

పెడన సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే కాగిత భేటీ

పెడన రూరల్ : పెడన పట్టణంలో విద్యుత్ సమస్యలు-పరిష్కార మార్గాలపై ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అధికారులతో శుక్రవారం చర్చించారు. డంపింగ్ యార్డ్‌లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తే చెత్తను కాల్చి తొలగించే ప్రక్రియకు అంచనాలు సిద్ధంగా ఉన్నాయని ట్రాన్స్‌కో డీఈ భాస్కరరావు తెలిపారు. 8, 9, 10 వార్డులకు నందమూరు ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నందున తరచూ అంతరాయం కలుగుతోందని టౌన్ ఫీడర్‌కు కలుపుతామని అధికారులు తెలిపారు.వార్డుల వారీగా సమస్యలను తెలియజేయగా పరిష్కారానికి సూచనలు చేశారు. హౌసింగ్ అధికారులతో ఇళ్ల నిర్మాణంపై ఆరా తీశారు. మౌలిక వసతుల ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు. ట్రాన్స్‌కో ఏడీఈ సిహెచ్‌ఆర్‌కె మాణిక్యాలరావు, మున్సిపల్ కమిషనర్ బి వెంకట్రామయ్య, హౌసింగ్ డీఈ బుచ్చిబాబు, ఏఈ రామచంద్రరావు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం(హన్ను), యక్కల శ్యామలయ్య పాల్గొన్నారు.

బాలికకు కుడివైపున గుండె.. సాయం కోసం వినతి

పెడన రూరల్ : ఎడమవైపు ఉండాల్సిన గుండె కుడివైపు ఉండడంతో పుట్టుకతోనే అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తెకు సాయం చేసి ఆదుకోవాలని చేనేత కుటుంబానికి చెందిన యర్రా వీరభద్రరావు శుక్రవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తన కుమార్తె పూజితా శివజ్యోతి 2003లో జన్మించిందని, పుట్టుకతోనే గుండె కుడి వైపు ఉన్నప్పటికీ వైద్యులు ఆ విషయం చెప్పలేదన్నారు. గుండె కుడి వైపు ఉందని, దాన్ని మార్చితే పాప ప్రాణానికే ముప్పు అని డాక్టర్లు తర్వాత తెలిపారున్నారు. ప్రభుత్వం నుంచి సాయమందేలా చూస్తానని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు.

పామర్రు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

• కలెక్టర్‌కు కుమార్‌రాజా వినతి

పామర్రు : పామర్రు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కలెక్టర్ డీకే బాలాజీని కోరారు. జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు అందించే విషయంలో గత ప్రభుత్వం పాల్పడిన అవినీతిపై తక్షణమే విచారణ జరపాలన్నారు. పేదలకు సత్వరమే స్థలాలు అందేలా చర్యలుతీసువాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి సరఫరాకు అవసరమైన నిధుల విడుదలచేయాలని కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే కుమార్ రాజా చర్చించారు. గ్రామాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బాలాజీ దృష్టికితీసుకుని వెళ్లారు. ఎమ్మెల్యే వినతి మేరకు సత్వర్యమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చినట్లు కుమార్‌రాజా విలేకరులకు తెలిపారు.



హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జేసీ గీతాంజలి శర్మ

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ

మచిలీపట్నం టౌన్ : వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణ రక్షణ పొందవచ్చని జేసీ గీతాంజలి శర్మ అన్నారు. కలెక్టరేట్ గేటు వద్ద శుక్రవారం వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. వాహనదారులను ఆపి హెల్మెట్ కొనుగోలు చేసి ధరించాలని సూచించారు. రవాణాశాఖాధికారులు పాల్గొన్నారు. **పామర్రు :** ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు. బైపాస్ రోడ్డులో హెల్మెట్ వాడకం పట్ల ద్విచక్ర వాహదారులకు అవగాహన కల్పించారు. గమ్యానికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో హెల్మెట్ ధరించడాన్ని విస్మరించరాదన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎం అండ్ హెచ్‌వో స్కానింగ్ కేంద్రాల తనిఖీ

కూచిపూడి : లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడతామని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి జి.గీతాబాయి తెలిపారు. కూచిపూడిలోని స్కానింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా చట్ట పరిధిలో నమోదు చేసుకోవాలన్నారు. స్కానింగ్ కేంద్రాలకు సంబంధించిన అనుమతులన్నీ ఉండాలన్నారు. ఆరోగ్య విద్యాబోధకుడు రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై శిక్షణ నేడు

అవనిగడ్డ రూరల్ : ఆయిల్ పామ్ సాగుపై రైతులు, గ్రామ ఉద్యాన వ్యవసాయ సహాయకులకు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం శిక్షణ జరుగుతుందని ఉద్యాన శాఖాధికారి ఎన్.రమేష్ తెలిపారు. కలెక్టర్ డీకే బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరవుతాయరన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

చల్లపల్లి : జనసైనికులు సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి బస్టాండ్ సెంటర్లో శుక్రవారం జనసేన సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని బుద్ధప్రసాద్ ప్రారంభించారు. జనసేనను నమ్ముకుని పనిచేస్తున్న పార్టీ కార్యకర్తల కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని అధినేత పవన్ కల్యాణ్ క్రియాశీలక సభ్యత్వ నమోదుతో బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. చల్లపల్లిలో గతంలో జరిగిన రోడ్డుప్రమాదంలో చనిపోయిన జనసైనికుడు మెండు దొరబాబు సతీమణి జ్యోతికి తొలి సభ్యత్వాన్ని అందించారు. అత్యధిక సభ్యత్వాలు నమోదుచేసిన సీనియర్ నాయకుడు పసుపులేటి రవికుమార్‌ను సన్మానించారు. జనసేన మండల అధ్యక్షుడు బోడగం విమల్‌కృష్ణ, జీవీ.తాతారావు, అడపా రాంబాబు, షేక్ నసీంఫోరి, నేతలు బాదర్ల లోలాక్షుడు, తోట మురళీకృష్ణ, బొందలపాటి వీరబాబు, సూదాని నందగోపాల్, అడపా రవి, గోళ్ల ప్రసాద్, ఉరిమి మణికాంత్, పినిశెట్టి నిరంజన్, పసుపులేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో జిల్లాలోనే అవనిగడ్డ నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపాలని ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, ఉపాధ్యక్షుడు భోగిరెడ్డి సాంబయ్య, మెరకనపల్లి నరేష్, కోసూరి శివాజీ, కేతరాజు శ్రీవల్లి ఉన్నారు.



చల్లపల్లిలో జనసేన సభ్యత్వాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

కొరియర్ శ్రీనుపై జనసేన నేత బండి రామకృష్ణ ఫిర్యాదు

మచిలీపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం జనసేన నాయకుల మధ్య నెలకొన్న విభేదాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకునే వరకు వెళ్లాయి. అసెంబ్లీ నియోజకవర్గం జనసేన సమన్వయకర్త బండి రామకృష్ణ, పార్టీ నాయకులు 60 మందికిపైగా వెళ్లి జనసేన నాయకుడు కొరియర్ శ్రీనుపై గురువారం రాత్రి బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్‌కు ఫిర్యాదు చేశారు. తన పట్ల అనుచితంగా ప్రవర్తించి, తోసివేసేందుకు ప్రయత్నించిన కొరియర్ శ్రీనుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రామకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కొరియర్ శ్రీనును శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేసినట్లు చిలకలపూడి సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఆర్ అండ్ బీ అతిథిగృహంలో మంత్రి కొల్లు రవీంద్ర గురువారం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొరియర్ శ్రీనును ఆహ్వానించలేదు. అక్కడకు వచ్చిన కొరియర్ శ్రీను తనను ఎందుకు పిలవలేదని బండి రామకృష్ణను ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీ నాయకులు ఇద్దరికీ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇది పార్టీ అంతర్గత వ్యవహారమని చెప్పడంతో టీడీపీ నాయకులు మిన్నకుండిపోయారు. సమావేశం ముగిసిన తరువాత అతిథిగృహం బయట బండి రామకృష్ణకు, కొరియర్ శ్రీనుకు మళ్లీ వాగ్వాదం జరిగింది. పరిస్థితి తోపులాట వరకు వెళ్లింది. బండి రామకృష్ణ వృత్తిని ఎత్తి చూపుతూ కొరియర్ శ్రీను వ్యక్తిగతంగా దూషణలకు దిగాడు. ఈ ఘటనపై బండి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన క్రమశిక్షణా కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కూడా కొరియర్ శ్రీను వ్యవహార శైలిపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం



సామూహిక సీమంతం

మచిలీపట్నం టౌన్ : సామూహిక సీమంతాల వల్ల గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేందుకు అవకాశం ఉంటుందని ఎస్‌బీఐ ఏజీఎం ఎస్. సుబ్రహ్మణ్యం అన్నారు. ఎస్‌బీఐ సహకారంతో మలకాపట్నం కన్వెన్షన్ హాలులో సామూహిక సీమంతాలు జరిపారు. ఐదుగురు గర్భిణులకు సామూహిక సీమంతం జరిపి, పోషక పదార్థాలు అందజేశారు. లంకిశెట్టి బాలాజీ, పెన్నేరు లతాదేవి, లంకిశెట్టి బాలాజీ, రవితేజ, నాగసాయి, శ్రావణి, సింధువైష్ణవి పాల్గొన్నారు.

భావదేవరపల్లి పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

నాగాయలంక : చందు సత్యనారాయణ, సుబ్బారావు తమ తల్లిదండ్రులు రాములు - కనకమ్మల జ్ఞాపకార్థం లక్ష రూపాయలు విలువ గల మూడు కంప్యూటర్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా భావదేవరపల్లి పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఆకుల జ్యోతిర్మయికి అందించారు. పాఠశాలకు సైకిల్ స్టాండ్ కూడా నిర్మిస్తామని దాతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, మాజీ సర్పంచ్ మెండు లక్ష్మణరావుతోపాటు మండల విద్యాశాఖాధికారులు టివిఎం.రామదాసు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

ప్రముఖ పారిశ్రామికవేత్త బొప్పన శరత్ గోపాల్ కన్నుమూత



గుడ్లవల్లేరు : ప్రముఖ పారిశ్రామికవేత్త బొప్పన శరత్ గోపాల్ (75) హైదరాబాద్‌లో శుక్రవారం వయోభారంతో మృతి చెందారు. శరత్ గోపాల్ స్వగ్రామం గుడ్లవల్లేరు మండలం పెంజంద్ర. హైదరాబాద్‌లో స్థిరపడిన శరత్ గోపాల్ స్వగ్రామం అభివృద్ధికి విశేష కృషి జరిపారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం, కల్యాణ మండపం, శ్మశాన వాటిక అభివృద్ధి, భవన నిర్మాణం, పెద్దచెరువుకు రెండు పశువల రేవులు నిర్మాణం, చర్చి నిర్మాణం సొంత నిధులతో చేయించారు. శరత్‌గోపాల్ మృతి పట్ల మాజీ సర్పంచ్ బొప్పన శివప్రసాద్, నూతులపాటి మల్లిబాబు, ఎ.కృష్ణమూర్తి(చిన్నమ్మ), ప్రసాద్, కిషోర్, సురేష్ తదితరులు సంతాపం తెలిపారు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయాలి



బంటుమిల్లి : మిచాంగ్ తుపాను నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం వెంటనే చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ మేరకు బంటుమిల్లి సచివాలయం-2 కార్యదర్శి వెంకన్నకు అర్జీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన రైతుకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం పనులను 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలని కోరారు. రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, మండల రైతు సంఘం అధ్యక్షుడు మలిశెట్టి శివరామ్ ప్రసాద్ కార్యదర్శి అజయ్‌ఘోష్, రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్దన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కోడూరు : గాలిని శుద్ధి చేసే శక్తి మొక్కలకే ఉందని స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ అన్నారు. నాగభూషణం మాస్టారు చేపట్టిన రోజుకు ఒక మొక్క నాటుదాం కార్యక్రమాన్ని శుక్రవారం జరుగువానిపాలెంలో నిర్వహించారు. విద్యార్థులచే మొక్కలు నాటించారు. 100 రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చల్లపల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి పి.సువర్ణరాజు సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం చల్లపల్లి సచివాలయం - 4 పరిధిలో ప్రజలకుఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో అవగాహన కల్పించారు. కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచిం చారు. పంచాయతీ కార్యదర్శి పివి. మాధవేంద్రరావు, ఎంపీహెచ్ఎస్ ఎస్.కమలాకరరావు, ఎంపీహెచ్ఏలు పి.రాజబాబు, ఎ.జసంతి, ఎంఎల్‌హెచ్‌పిలు ప్రవల్లిక, గౌతమి, సునీత, ఆశా కార్యకర్తలు రత్నకుమారి, రమ్యశ్రీ, లలిత పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్ :** నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చి డెంగ్యూ, మలేరియా రాకుండా చర్యలు చేపడతామని జిల్లా ఆరోగ్య విద్య విస్తరణాధికారి బి. శివసాండిరెడ్డి అన్నారు. చిలకలపూడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రావ్య పర్యవేక్షణలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మురళి, ఏ. నాగమణి, కె. బాలాజీ, సిహెచ్. ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.